సమాజం నాడీపరీక్ష

క్షమించాలి. నాకు తెలిసిన విషయాన్ని స్పష్టంగా చెప్పకుండా ఉండలేను. అది నా బలహీనతే కావచ్చు; అయినా ఇబ్బంది లేదు. తెలుసుకున్న విషయాన్ని దాచుకుని, మొహం చాటు వేయడం పంచమహాపాతకాల్లో ఒకటిగా పరిగణిస్తాను. అంచాత మీరు, దయచేసి సావధానచిత్తంతో వినాలని సహజంగా అభిలషిస్తాను.

ఇంతకీ నేను చెప్పదలచిన విషయం మిత్రుడు కె. రామానందం గురించి. రామానందం గురించి అంటే అతని గురించీ, భాస్కర్రావు గురించీనీ; ఇంతకీ ఒక్కళ్ళ గురించేమిటి? అతనూ, నేనూ, ఇతోధికంగా మీరు కూడా భాగస్వాములే అయిన మన సమాజం గురించే నేను యథాశక్తి చెప్పతలచాను. ఆలోచిస్తే ఇది మీకు తెలిసిన విషయమే.

అయినా సందేహనివృత్త్యర్థం నేనే విశదపర్చడం ఉభయత్రా మంచిది. కాబట్టి జాగ్రత్తగా వినవలసిందని మరోసారు హెచ్చరిస్తున్నాను.

అదిగో అప్పుడే మొహం అదోలా మారుస్తున్నారు. నాకు తెలుసు; నామీద మీకు కోపం వస్తోంది...... 'అది యొక పల్లెటూరు' అనో, 'ఈ చెవిగాడ్పు ఆ చెవికి వీచుతూ చండప్రచండంగా మండిపోతున్న వేసవికాలమది' అనో ప్రారంభించాలి; అమ్మాయి అబ్బాయి ఎలా కలుసుకున్నారో, ఎలా ప్రేమలేఖలు రాసుకున్నారో వివరించాలి; ఎలా విడిపోయారో లోకం ఏవిధంగా చీకటైపోయిందో, హృదయంలేని సంఘపిశాచి ఆ ప్రేమైకజీవుల్ని ఎలా బలిగొందో వర్ణించాలి; అలావ్రాసి, నాపూచీ తీరిపోయిందికదా అని తృప్తి చెందాలి. పాడిందే పాటగా మోతపెట్టాలి. పాత గ్రామఫోనురికార్డుల్ని వినడానికి అలవాటుపడ్డ పాఠక మహాశయుడు హాయిగా చదువుకుంటాడు; గుండెలమీద పుస్తకం పడేసుకుంటాడు; తేనుస్తాడు; నిద్రపోతాడు. నిద్రలో కల, కలలో కలవరింత; ఆవిధంగా నన్నూ, నాకథనీ మెచ్చుకుంటాడు. అలాంటివారు నూటికి నూర్గురే అయినా, వారిని సంతృప్తి పరచలేనందుకు క్షంతవ్యుణ్ణి.

"సెలయేరు ఎందుకు ప్రవహిస్తోంది? సూర్యుడు ఎందుకుదయిస్తున్నాడు? కోయిల ఎందుకుపాడుతోంది? ఇవన్నీ

దేనికోరకు? అని ప్రశ్నించుకుని, ప్రేమకోరకు, ప్రేమకోరకు, ప్రేమకోరకు!' అని సమాధానపడలేను. తృప్తి పొందలేను. కాబట్టి, ఈ సమాజం కేవలం ఏదో కొద్దిమంది వ్యక్తుల ఊహాపోహాలవలె ప్రేమైక మనస్థితిలో జీవించడంలేదనీ, పరస్పర విద్వేషాలతో కుతకుత లాడుతోందనీ, దానికంతకి ఆర్థిక అసమానతలే కారణమనీ నమ్ముతున్నాను. అందువాతనే ఈ కథ ఈవిధంగానే ప్రారంభమైంది.

నిజమే; సమాజ జీవితంలాగే ఈకథకూడా జిలిబిలిగానే ఉంది. సరిగ్గా ఏదో ఒక్కచోట ప్రారంభంకాలేదు; ఏదో ఒకే మూలబిందువువద్ద పరాకాష్ఠ చెందలేదు; సరిగ్గా అదే విషయంతో అంతంకాలేదు. నాకు తెలుసు; ఇవన్నీ శోచనీయ పరిస్థితులని!

ఇంత చెప్పినప్పటికీ ఓపికతో విన్న మీరు, నేను కె. రామానందం గురించి చెప్పడం మరిచిపోయానని అపోహ పడతారు. మరచిపోలేదు. అది నిర్ధరించడానికే ఈ ఉపోద్ఘాతమంతాను!

నాకు బాగా జ్ఞాపకముంది. బహుశా మా ఆవిడేనను కుంటాను; లోపల్నించి వచ్చింది. మామూలు మందస్వరంతో అంది– "మీకోసం ఎవరోవచ్చారు" అని.

"ఎవరూ?" అన్నాను. తృళ్ళిపడ్డాను. "ఇన్సూరెన్సు ఏజెంటు– భీమారావా?" అన్నాను. అప్పులవాళ్ళ పేర్లు కూడా ఒకటి రెండు అడిగాననే జ్ఞాపకం.

ఆవిడ నాప్రశ్నలకి దేనికీ సూటిగా సమాధానం ఇవ్వ లేదు. పకపకా నవ్వింది. "ఏమిటాకంగారు?" అంది. "కాదు స్నేహితులే!" అని ఆఖరికి సమాధానంగా అంది.

నాకు బాగా జ్ఞాపకంవుంది— ఊడిపోతున్న లుంగీ బిగించుకున్నాను. ఆరిపోయిన సిగరెట్టుతో డిపు గిరాటు వేశాను. ఎకాఎకీ వీధిలోకి వచ్చాను. ఆతిథ్యంఇచ్చే హుందాతో నవ్వుముఖం పెట్టాను. స్నేహితుల్ని లోనికి ఆహ్వానించాను.

నాకు బాగా జ్ఞాపకంఉంది— మొత్తం ముగ్గురే స్నేహితులు వచ్చారు. అందులో మన కథానాయకుడు కె. రామానందం మొదటివాడు కాడు; మూడోవాడు. మిగతా ఇద్దరూ— రామచంద్రం, వెంకటప్పారావు...వచ్చారా? వచ్చి, చూపించిన ఉచితాసనాలమీద మర్యాదగానే కూర్చు న్నారు. అల్లరి చిల్లరి పనులేమీ చేయలేదు. 'అవి కావాలి. ఇవి కావాలి!' అని ఏమీ పేచీలు పెట్టలేదు. స్వంత జేబు ల్లోంచే కాల్చుడుసామాను తీసుకున్నారు— అగ్గిపెట్టె నన్నే అడిగారనుకోండి; అక్కణ్నించి సంభాషణ ప్రారంభించారు.

బెర్లిన్ సమస్యనుంచి మావూరి పంచాయితీ బోర్డు గొడవలువరకూ అన్ని విషమ రాజకీయాలు మాట్లాడారు. మాట్లాడవలసినవన్నీ యించుమించు పూర్తి కావచ్చాయి.

వాకిట్లోకి వెళ్ళి సిగరెట్టుపారేశాడు, పుమ్మేసివచ్చాడు రామానందం. వచ్చితనకుర్చీమీదకూర్చున్నాడు. కాలుమీద

కాలు పెట్టుకున్నాడు. జేబురుమాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. చేతిలో చుట్టబెట్టి పట్టుకున్న వారపత్రిక తీసి చూపించాడు. డ్రెమెటిక్ గా ప్రారంభించాడు—

"ఇది నా రెండో కథ అనుకో— దీన్ని చూడు!" అన్నాడు.

చూచాను. "బాగుంది" అన్నాను.

"అదా మరి, చదవరా— చదివి నీ అభిప్రాయం చెబుతావని కాదు!" అన్నాడు.

"నువ్వే చదివి వినిపించరా!" అన్నాడు వెంకటప్ప. రామచంద్రం ఏమీ మాట్లాడలేదు.

"ఏంరా!"— మళ్ళీ అన్నాడు రామానందం.

ఏముంది?...'ఊఁ...' అన్నాను.

రామానందం కథ చదవడం ప్రారంభించాడు.

రామచంద్రం పొడుగాటి, నల్లటి లంకాకు చుట్ట కాలుస్తున్నాడు. పెద్దహోదా కనబరుస్తున్నాడు. దీర్ఘంగా, దట్టంగా అలుముకొనే మేఘాలు విడుస్తున్నాడు. కళ్ళజోడు లోంచి క్రీగంటితో అదోలా చూస్తున్నాడు. వినీ విననట్టు నటిస్తూ, జాగ్రత్తగా వింటున్నాడు.

వెంకటప్ప!... చాలాజాగ్రత్తగల వెంకటప్ప, రామానందం కళ్ళల్లోంచి నాకళ్ళల్లోకి చూపుల్ని తిప్పుతున్నాడు.

కి యిస్తే కళ్ళుతిప్పే ఎగ్జిబిషన్ బొమ్మలు జ్ఞాపకం వచ్చాయి నాకు. కథలోని హావభావాలకీ అనుకూలంగా ముఖ కవళికల్ని మారుస్తున్నాడు. మొత్తానికి చాలా సందడిగా ఉత్సాహంగా ఉన్నాడు.

రామానందం కథ చదువుతున్నాడు.

రామానందం నాకు 'ఒరేయ్' అనుకునేంత సన్నిహితుడు. ఫోర్తుక్లాసునుంచి స్కూలుఫైనల్ వరకూ కలిసి చదువుకున్న సహపాఠి. పైగా, వాడినాన్నగారికీ మాతండ్రిగారికీ కూడా స్నేహసంబంధాలు—చాలా రకాలుగా ఉన్నాయి. ఇంత ఆప్తతగల రామానందం, ప్రఖ్యాత వారపత్రికలో ప్రచురింపబడిన కథ చదువుతుంటే, నేను నిర్లక్ష్యం చేస్తానా! అంచాతనే సావధానచిత్తంతో, శ్రద్ధాభక్తులతో వింటున్నాను.

"ప్రఖ్యాతవారపత్రిక" అని అన్నాను అంటే, ఒక్క అమ్మకాలబట్టేకాదు; ప్రఖ్యాతి వహించిన ఆసామీ సంపాదకుడు కావడంవల్ల; అనేకసార్లు అనువాదమైన సుప్రసిద్ధ రష్యన్ కథకి మక్కీకిమక్కీ తెలుగుచేసి, స్వంత పేరుతో పంపే రచయితలున్నా, వారికి యితోధికస్థానమిచ్చి, ప్రచురించడానికి సుప్రసిద్ధసంపాదకులు పూనుకోవడం వగైరా అనేక మహత్కారణాలవల్ల అది ప్రఖ్యాత వారపత్రిక అవుతుంది. అట్టి సుప్రసిద్ధ వారపత్రికలో ప్రచురించబడింది కాబట్టేన్నీ,

పైన చెప్పిన కారణాలవల్ల రామానందం అభిమాన పాత్రుడు కాబట్టినీ, చదవబడుతున్న కథను శ్రద్ధగా వింటున్నాను.

రామానందం కథ చదువుతూనే ఉన్నాడు...

కథ ఏమంత చెప్పుకో తగ్గదీకాదు. కథాశిల్పంలోగాని శిల పరిశీలనలోగాని పటుత్వంలేదు. వాస్తవంలోని గందర గోళాన్ని పరిష్కరించలేని పారుబోతుతనం స్పష్టంగా వ్యక్త మవుతోంది. ఏవిధమైన బిగీలేదు. కంగాళీగాఉంది.

కథచదవడం పూర్తి చేశాడు రామానందం.

క్షణకాలం, మేం కూర్చున్న ప్రదేశంలో నిశ్శబ్దం వ్యాపించింది. నేనేమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాను. వెంకటప్ప నాముఖం కేసిత దేకదీక్షతో చూస్తున్నాడు. రామా నందంకూడా, ఆత్రంగా ఆశగా నాముఖం వేపే చూస్తున్నాడు. రామచంద్రం ఏమీమాట్లాడలేదు. చుట్టపొగ వదుల్తూ యథాలాపంగా చూస్తున్నాడు. నేను కూడా నోరు విప్పలేదు

రామానందం కీచుగొంతుతో అడిగాడు: "ఎలా ఉం దిరా, కథా?" అని.

"బాగానే ఉంది!" అన్నాను, వదుల్చుకోవాలనే అభి ప్రాయంతోనే అలా అన్నాను. చేసిన పాపం చెబితే పోతుం దంటారు: నిజం చెప్పినాడికి కష్టం కలిగించడ మెందుకు? నేను నిష్ఠురపడ్డం దేనికి?— ఈఉద్దేశంతోనే అలా అన్నాను.

రామానందం వదిలేట్టు కనిపించలేదు. "అది కాదురా, ఎలావుందో స్పష్టంగా విమర్శించి చెబుతావనికదా, నిన్నడగడం" అన్నాడు. 'బాగానేవుంది'అన్నాను కాబట్టి, ఎందువల్ల బాగున్నదో, ఏగొప్ప కారణాలున్నాయో సహేతుకంగా విమర్శించి చెబుతానని భావించాడు.

వెంటనే నిర్ణయించుకున్నాను— ఇంక దాక్కోని లాభం లేదని. నిశ్చయంగా అడగవలసింది అడిగేశాను— "ఏంరా అయితే నామనస్సులో ఉన్నదున్నట్లు చెప్పమన్నావా ? నీ కిష్టంలేనిదేమైనా చెబితే కష్టపెట్టుకోవు కదా ?" అన్నాను.

ఈ వాక్యాలింకా పూర్తిచేయలేదు. రామానందం మొహం వాడింది. కళ్ళు చిట్లిస్తూ అన్నాడు—"దాని కేంరా... చెప్పు !" అని.

వెంటనే అన్నాను— "ఆ పత్రిక ఇలాఇయ్యి!" అని.

రామానందం మౌనంగా ఇచ్చాడు.

చిన్నపిల్లలు తాటాకు టపాకాయికి నిప్పు ముట్టిస్తారు. దూరంగా విసిరేస్తారు. టపాకాయి పడ్డచోటునుంచి పువ్వుల్ని చిమ్ముతూంటే రెప్పవాల్చకుండా దీక్షగా చూస్తారు. అది ఎలా పేలుతుందో చూడాలి !— అన్నీ ఒక్కలాగే పేలినా దాని ప్రత్యేకతేమిటో కనిపెట్టాలి; చూచి ఆనందించాలి ! అంతే— తప్పితే వేరే ఆలోచనే ఉండదు. వాళ్ళ బుర్ర ఖాళీగా ఉంటుంది... అలాంటి ఆలోచనాశూన్యత, దీక్ష కని

పిస్తున్నాయి, వెంకటప్ప ముఖంలో! వాడు రెప్ప వాల్చ కుండా నాముఖంకేసి అలాగేచూస్తూ ఉండిపోయాడు.

రామచంద్రం— కళ్ళజోడు తీశాడు. కనుకొలకులు శుభ్రం చేసుకొన్నాడు. ముఖం తుడుచుకున్నాడు. మళ్ళీ కళ్ళజోడు పెట్టుకొని, కాళ్ళుచాపుకుని కూర్చున్నాడు.

ఏమాత్రం కాలహరణమూ సహించేట్టులేదు వాళ్ళు. సంచలిస్తూన్నాయి వాళ్ళచూపులు... నేను వెంటనే ప్రారంభించాను—

"కేవలం పత్రికల్లో పేరు అచ్చుకావడమే పరమప్రయోజనంగా పెట్టుకొని వ్రాసినట్టుంది. తీవ్రంగా ఆలోచించి, సామాజిక పరిస్థితుల్ని అవగాహనచేసుకుని, ఫీలయి, వ్రాసినట్టు కనిపించదు" అన్నాను.

ఇంకా నేను చెప్పవలసింది పూర్తికాలేదు. రామానందంలో తప్ప మిగతావాళ్ళ ముఖాల్లో ఏవిధమైన మార్పులూ గోచరించలేదు. ఉద్రేకంలేకుండా మామూలుగానే చెబుతున్నాను...ఒక్కక్షణం ఆగి, పత్రిక తిలకించాను. అప్పుడుగాని కనిపెట్టనేలేదు; పాపంమాటలెందుకుగాని!... కె. రామానందం తన పూర్తి నామధేయాన్ని వాడేసుకోలేదు... 'ఆనందశ్రీ' అనే కలంపేరు మాత్రమే వాడు

కున్నాడు. కాబట్టి కేవలం పేరుఅచ్చుకావడానికే రాసేవాడనటం అన్యాయం— ఈ ఆలోచనకూడా కలక్కపోలేదు.

ఒక్కక్షణం ఆగి, యిలా అనుకున్నాను... శ్రీశ్రీ కవిగా గొప్పవాడయ్యాడు. దానికి కారణం అతని పేరులోని శ్రీకారమే నని భావిస్తారు అమాయకులు! ఈ ఆలోచన ప్రారంభించిన తొలినాటినుంచి నేటివరకూ, ఎన్ని వేలమంది రచయితలు ఈదగ్గరిదారి తొక్కలేదూ! తమకు ముద్దుగా తల్లిదండ్రులు పెట్టిన పేరుతో సంబంధం ఉన్నా లేకున్నా ఏదో ఒక పదాన్ని ఏరుకుంటూరు. దానికి శ్రీకారం తగిలించుకుంటారు. పాపం చాలా తృప్తిచెందుతారు! తమకీ ఒక శ్రీకారముందికదా అని మురిసిపోతారు.

సరిగ్గా ఆ క్షణంలో నాకు మరో రెండు సంగతులు జ్ఞాపకం వచ్చాయి. వెనకటికి మేనమామ అదృష్టవంతుడు కావడానికి చెవులో వెంట్రుకలే కారణమనుకున్నాట్ట ఒక పెద్దమనిషి. దేవుణ్ణి చెవులో వెంట్రుకలు వరంగా కోరుకున్నాడట... అక్కన్న మాదన్నలకి బట్టతల ఉంది మా ఆయనకీ ఉంది అని సంతోషించేదట ఒకావిడ. ఆమె భర్త వంట బ్రాహ్మడు, అక్కన్న మాదన్నలు మహామంత్రులూను!!... ఇలాంటిమహావ్యక్తులంతా రామానందంలాంటి మనవాళ్ళయ్యా లందరికీ స్వయానా మూలపురుషులై వుంటారు అనుకున్నాను.

మా రామానందం, దేవుడివరంవల్ల ఆనందశ్రీగా మారితే మనకి పేచీ ఏముంది? కథ నాకుమాత్రం నచ్చలేదు. నిజానికి అది గొప్పకథే కావచ్చు! లేకపోతే సుప్రసిద్ధ సంపాదకులెందుకు ప్రకటిస్తారు?

కథమీద నా అభిప్రాయం పూర్తి చేయడానికి ఉపక్రమించాను— "నేటి సమాజంలో భార్యాభర్తలు స్నేహపూర్వకంగా ఉండటంలేదంటే, దానికి కారణం ఏమిటి? ఈ ఆలోచన ఈ కథకుడికి రానేలేదు. ఏమంటావ్? కాని, తనకు తోచిన పరిష్కారం సూచించడానికి ప్రయత్నించాడు...సంసార స్త్రీల కన్న వ్యభిచారం జీవనోపాధిగాగల భోగంచానలే ఎక్కువగా ప్రేమిస్తారని వాదించావు; అంటే సమాజంలోని స్త్రీలందరూ ఎవరో ఒక వ్యక్తిని ప్రేమించగలగాలంటే వ్యభిచారం వృత్తిగ స్వీకరించాలంటావా?... మరి ఏమిటి నీ ఉద్దేశం?" అని సూటిగా ప్రశ్నించాను. వాడు మాట్లాడలేదు. "అంటే సమాజాన్ని వెనక్కి, అనాగరికదశలోకి నెట్టివేయడంకాదా?" మళ్ళీ అడిగాను. ఈమాటు వాడి ఎర్రనిముఖం కొంచం నల్లబడింది.

నేను చెబుతున్నాను: "ఇలాంటి కథలు ఎవడో ఒకడి బుర్రలో యాదృచ్ఛికంగా జనించినవికాదు. నాకు తెలుసు— ఏ వ్యవస్థఅయితే స్త్రీని వ్యభిచారిణిగా చేసిందో ఆ వ్యవస్థ తాలూకు సిద్ధాంతాలే వీటికి ప్రాతిపదిక. ఇలాంటి కథల

వెనుక ప్రమాదకరమైన సంఘటనలు జరగడంకూడా కారణం కావచ్చు...వీటినన్నిటినుంచి తట్టుకోలేని రచయిత, కుటుంబ జీవితంలో సంఘర్షణలు లేకుండా వుండాలని వాంఛించి, దాని కోసం ఇలాంటి తప్పుడు మార్గాలు సూచించడం మరీ ప్రమాదం...ఏమంటావ్ ? ఒక్కటిమాత్రం నిజం— ఈ పరిస్థితుల్ని ఇలాగే ఉంచి సమన్వయపరచలేమనేది నిజమే; పరిష్కరించి తీరాలి. పరిష్కారం పైనుంచి చూస్తే తేలేదికాదు; లోతుకు వెళ్ళవరకూ పోవాలి! ఏమంటారు!'' అన్నాను. అందరి ముఖాలకేసీ చూశాను.

రామానందం ఏమీ మాట్లాడలేదు.

ఫిలాసఫర్‌లాగ ముఖంపెట్టి రామచంద్రం వింటూనే ఉన్నాడు. సోఫామీదకూర్చుని చుట్టకాలుస్తున్నాడు.

వెంకటప్ప కళ్ళు... పాపం చాలా ఆందోళన పడుతు న్నాయి! 'మాబాగా చెప్పావు!' అంటున్నట్టు నాకేసి, 'చూశావురా, ఎంత కొంపముంచాడో!' అంటున్నట్టుగా రామానందంకేసీ వడిదుడుగ్గా చూస్తున్నాయి.

రామానందం బైటికి ఏమీ అనలేదు. లోపల్లోపల చాలా అనుకుంటున్నాడు. ఆమాటలన్నీ కొంచెం ఇంచుమించులో, అచ్చుతప్పులతో ముఖంమీద ఖచ్చితంగా చదవగల్గుతున్నాను.

విషయం మార్చాను. కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడ్డానికి ప్రయత్నించాను. మిత్రుల్ని సంతోషపెట్టడానికే ప్రయత్నించాను. ఎవ్వరూ మాట్లాడ్డంలేదు– కాబట్టి రామచంద్రం మాట్లాడుతాడనుకోలేదు; కాని అలా జరగలేదు. హఠాత్తుగా ఒక్క ముక్క విసిరాడు– "నువ్వు చెప్పిందాంట్లో నిజంలేకపోలేదనుకో!" అని. అయితే ఏ పాయింటుని సమర్థిస్తున్నాడో తేల్చలేదు.

తర్వాత వాళ్ళు హాలో తేకువసేపు కూర్చున్నారు. మొదట రామచంద్రం లేచాడు. "అప్పుడే పన్నెండయింది– ఆకలి వేస్తోంది పోతాం" అన్నాడు. తర్వాత రామానందం వెంకటప్పాకూడా లేచేరు. "వస్తానురా–దాసూ" అన్నాడు రామానందం. వెంకటప్ప ఏమీమాట్లాడలేదు, ముగ్గురూ వెళ్ళిపోయారు....

నాకు బాగా జ్ఞాపకంఉంది — ఆవేళ తెల్లవారుఝామునే లేచాను. లేస్తూనే వేసవికాలంలో లభించే కోయిల అరుపుల్నీ, దక్షిణపుగాలుల్నీ ఔషధప్రాయంగా సేవించాను. కూర్చునీ, జేమ్సుజోయిస్‌గాడి 'డబ్లినర్సు' చదువుతున్నాను. బాగా తెల్లవారి రెండు మూడు గంటలైనా నేను కూర్చున్న చోటునుంచి కదల్లేదు. దక్షిణపువసారాలో కూర్చుని పేజీలు తిరగవేస్తున్నాను. పొగ పీలుస్తున్నాను.

నాకు బాగా జ్ఞాపకం ఉంది. మర్నాడే అనుకుంటాను"

మళ్ళీ యథావిధిగా, మిత్రులు వచ్చారనే కబురు తెలిసింది. మామూలుగానే వీధిలోకి వెళ్ళాను. మిత్రుల్ని ఆహ్వానించాను. ఈసారి ముగ్గురూ కలిసిరాలేదు. రామచంద్రం, వెంకటప్పా మాత్రమే వచ్చారు. రామానందం రాలేదు.

"వాడు రాలేదేం?" అని అడిగాను.

రామచంద్రం వెంటనే సమాధానం చెప్పాడు; "వాడికి ఒంట్లో బావుండలేదట — సాయంత్రంగాని బైటకి రానన్నాడు మేమే వచ్చాం" అని.

"అంతేనా — నామీద కోపం వచ్చిందా?"

"కొంచం అదికూడా ఉందనుకో!" అన్నాడు రామచంద్రం.

వెంకటప్ప అందుకున్నాడు; "అబ్బే అదేమిట్రా... కోపం ఏమీ రాలేదు కాని కొంచెం ఫీలయాడంతే!"

"ఎందుకు ఫీలవడం?"

"నువ్వు వ్యక్తిగత విషయాలమీద విమర్శించావు గాని కథమీద కాదని వాడుద్దేశపడుతున్నాడు..." అన్నాడు రామచంద్రం!

చచ్చాను!... కొంప మునిగిపోయింది! చాలా కంగారు పడ్డాను. అడిగేశాను; "వ్యక్తిగత విషయాలమీద విమర్శ

ఇప్పుడమేమిటి?—వ్యక్తిగత విషయాలేమిటయ్యా, ఖర్మం?" అని.

"ఆఁ...మరీ తెలియనట్టు మాట్లాడతావేంటి? వాళ్ళ సిస్టర్ గొడవ!" అని తుంచేశాడు రామచంద్రం.

"అదేమిటోయ్! నాకు తెలియనే తెలియదు!" అన్నాను. "ఛండాలుడు! తెలిస్తే అబద్ధం చెబుతానా-?" అన్నాను "తల్లి పరుస చెబితే నమ్మాలి మరి!" అన్నాను. ఇలాంటివే మరి కొన్ని చిల్లర ఒట్లుకూడా వేశాను, రామచంద్రం నమ్మాడు.

సత్య ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను, వాళ్ళసిస్టర్ గురించి వీసమెత్తుకూడా తెలియదు నాకు.

"ఆఁ ఏముంది లెద్దు ... వాళ్ళసిస్టరూ" అని ఏదో చెప్పడం ప్రారంభించాడు వెంకటప్ప. గభాలున అడ్డువచ్చాడు రామచంద్రం..."నువ్వుండు!" అని.

" వాడి సిస్టర్ లేదూ-శ్యామలా! దానికి నాలుగేళ్ళ క్రితం పెళ్ళిచేసారు, ఏదో దూరపు సంబంధం వెదకి, వాడు రోగిష్టి, అసహ్యంగా ఉంటాడు ... డబ్బు మాత్రం మస్తుగా ఉందనుకో! పెళ్ళినాడే గోల పెట్టి ఏడ్చిందట సుమా! మన కుటుంబాల్లో ఆడపిల్లల ఏడుపులు ఎవరువింటారు?" అన్నాడు. చెబుతూనే ప్రశ్నించాడు. నిజమే మరి, ఎవ్వరూ వినరు... వెంకటప్ప వారపత్రిక చూస్తున్నాడు.

రామచంద్రం చెబుతూనే ఉన్నాడు; "పెళ్ళి చేసారు. శ్యామల పెద్దమనిషి కూడా అయింది. కార్యం చేయడానికి పూనుకున్నారు. 'వద్దు మొర్రో' అని ఏడ్చిందట. బలవంతాన గదిలోకి తోసారుట. అందరికీ తెలుసు; శ్యామల దాని మొగుడి దగ్గర పడుకోలేదని. తర్వాత కాపరానికి వెళ్ళమని నిర్బంధించడం ప్రారంభించారు. ఒకసారి తండ్రి చావకొట్టాడట...పీడు, రామానందంగాడు కూడా 'మొగుడి దగ్గరకు పోయి బతికితే బతుకు! లేకపోతే చావు' అంటూ పశువులా ప్రవర్తించాడు. గొడ్డుని బాదినట్టు బాదాడట ... పాపం! శ్యామల ఎంతఅందంగా ఉంటుందనుకొన్నావ్?—" అన్నాడు. జాలిగా కళ్ళు తిప్పాడు.

చురుక్కున సూటిగా చూశాడు. నాకు జ్ఞాపకం వచ్చింది..."మనకి రెండు క్లాసులు జూనియర్—తర్డుఫారంలో మాన్పించేసారు" అన్నాడు మళ్ళా రామచంద్రం. ఈమాటు స్పష్టంగా జ్ఞాపకం వచ్చింది. ఎదిగిన తర్వాత చూడలేదు, కాని ఎంత అందంగా ఉంటుందో స్పష్టంగా చూడగలిగాను. "అంతేనా? ఇంకా ఏమైనా జరిగిందా?" అనుమానంతో అడిగాను.

దుడుంగున సర్దుకొని వెంకటప్ప—"అసలు కథలోనికి రాలేదు మనవాడు; అబ్బోర్భక్తిబోల్డు!" అన్నాడు. తనఉనికిని సమర్థించుకోడానికి వాడు చేసిన మహాప్రయత్నమిది. రామ

చంద్రం వాడికేసి ఛీత్కారంతో చూసాడు. వెంకటప్ప ఊరుకున్నాడు.

రామచంద్రం ప్రశ్నించాడు; "మనూళ్ళో ఉండేవాడు. భాస్కర్రావుని ఎరుగుదువా నువ్వు?" అన్నాడు.

"ఆఁ — ఎరక్కేం వాడూ నేనూ కలిసి నాటకంలో వేషాలు వేశాం" అన్నాను.

"ఆఁ—వాడే! ఎలా కలిసిందో తెలియదు కానీ, వాడూ రామానందం మిక్కుటమైన స్నేహితులైపోయారు... అంతే! ఏడాది క్రిందటే వాళ్ళిద్దరూ కలిసి ఈ ఊరునుంచి ఉడాయించారు. ఎక్కడున్నారో తెలియదు. వీళ్ళూ పట్టించుకోవడం లేదులే..."

"ఆహా — అదా సంగతి — నాకు తెలియనే తెలియదుసుమా! — ఆమధ్య నాకు భాస్కరరావు బెజవాడలో కనిపించాడు..." అన్నాను.

వెంకటప్ప ఆశ్చర్యంగా చూసాడు. ఉల్లాసంగా నవ్వుతున్నాడు. ఎందుకు నవ్వుతున్నాడో తెలియదు. ప్రతి ఇంటికీ ఉంది మట్టిపొయ్యి...!

"ఐతే దీనికీ నావిమర్శకి సంబంధ మేమిటి?" అన్నాను.

..."ఏమో మరి?" అన్నాడు రామచంద్రం.

రామానందం అలా బాధ పడ్డానికి గల కారణం ఏమిటో తెలియలేదు. భాస్కర్రావు—శ్యామల లేచిపోవడానికి

రామానందం కథ వ్రాయడానికి, దానిమీద నేను విమర్శ చేయడానికీ—మధ్యనున్న సంబంధం ఏమిటో అర్థం కాలేదు... రామానందం ఎందుకు ఇబ్బంది పడ్డాడో నాకు సుతరామూ బోధపడలేదు. అది నేటికీ తీరని సమస్యగానే మిగిలిపోయింది.

కాని ఒక్క విషయం నాకు చాలా విచారం కలిగి స్తూంటుంది...రామానందం మళ్ళీ కథలు రాయలేదు.

★